క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అవార్డు రావడం అభినందనీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మహ్మద్ సులేమాన్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందడం అభినందనీయమని ఆల్‌మేవ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆల్‌మేవా ఆధ్వర్యంలో సులేమాన్‌ను ఘనంగా సన్మానించారు.

రక్తదాన శిబిరానికి తరలిన ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాద్– ఉన్– నబీ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ ఫలక్‌నుమాలోని బసెరా ఫంక్షన్‌హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో రక్తదానం చేయడానికి వెళ్తున్న ముస్లిం సోదరుల ప్రత్యేక బస్సును సయ్యద్ అఫ్రోజ్‌షా ఖాద్రీ జెండా ఊపి ప్రారంభించారు. ఖాజామైనొద్దీన్, ఇలియాజ్ ముజాహిద్, మొయిజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన

గండేడ్: ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇళ్లను అధికారుల బృందం పరిశీలించింది. ఆదివారం గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో వారు పర్యటించారు. ఎంపీడీఓ దేవన్న, రాములు ఇతర అధికారులు మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి, బల్సూర్‌గొండ, పగిడ్యాల్, పెద్దవార్వాల్, నంచర్ల తదితర గ్రామాల్లో కూలిన ఇళ్లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు.

అడ్డాకుల: అడ్డాకుల మండల కేంద్రంతో పాటు వర్నెలో వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను అధికారులు పరిశీలించారు.

కూలిన ప్రహరీ

జడ్చర్ల టౌన్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న బాలాజీనాయక్ ఇంటి ప్రహరీ కూలింది. మట్టి పూర్తిగా తొలగిపోయి ఇంట్లో నుంచి బయటకు రావటానికి వీలులేకుండా అయ్యింది. దీంతో బాధితుడు కాంగ్రెస్ నాయకుడు రవితేజ ద్వారా 9వ వార్డుకౌన్సిలర్ చౌహాన్‌కు సమాచారం అందించగా.. ఇంట్లోని వారిని జేసీబీ సాయంతో బయటకు తీసుకొచ్చారు.

నాయకుల సంతాపం

మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్‌కి చెందిన టి.వెంకటయ్య(58)(ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వెంకటస్వామి హాజరై పులమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ పాడె మోశారు.

మహిళకు గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: కారును అదుపు చేయలేక ఓ మహిళ.. రోడ్డుపై వెళ్తున్న మహిళతో పాటు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం ప్రధాన రహదారిపై ఓ మహిళ కారు నడుపుకొంటూ వెళ్తుంది. ఈ క్రమంలో సడెన్‌గా బ్రేక్‌కు బదులుగా ఎక్స్‌లేటర్ తొక్కడంతో ఒక్కసారిగా ముందు వెళ్తున్న మహిళతో పాటు రోడ్డుపై నిలిపిన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కారు ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

భూత్పూర్: మున్సిపాలిటీలోని 10వార్డుల్లో ఆదివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వర్షాలు అధికంగా కురుస్తుండటంతో డ్రెయినేజీలు శుభ్రం చేయడం, ఇళ్ల మధ్య ఉన్న మొక్కలు ఏపుగా పెరగడంతో, రోడ్ల వెంట చెట్లు పెరగడంతో మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్నారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ 3వ వార్డు గోప్లాపూర్‌లో ప్రత్యేక డ్రైవ్‌ను పరిశీలించారు. శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

జైనల్లీపూర్‌లో శిబిరం

పాలమూరు: సుశృత ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలో జైనల్లీపూర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో రక్తహీనత పరీక్షలు, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. అదేవిధంగా వైద్యులు మనోహర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, రాజేష్ అజ్మీర, వేణుగోపాల్, సుస్మిత, ప్రత్యూష పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఈఓకు ఫిర్యాదు

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయంలో నిబంధనలకు విరుద్ధంగా టెంకాయల విక్రయం చేపడుతున్నారని, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నవాబుపేటకు చెందిన రాజేష్ ఆదివారం ఈఓ మదనేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు.

నిలిచిన రాకపోకలు

రాజాపూర్(బాలానగర్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షలతో పాటు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గుండేడ్ శివారులోని ముద్దాయచెరువు అలుగు పారడంతో ఆదివారం బాలానగర్ మండలం నుంచి ఉడిత్యాల గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముద్దాచెరువు అలుగు వద్ద గతంలోని కల్వర్టు స్థానంలో కొత్తగా వంతెన నిర్మిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా తాత్కాలికంగా పైపులు వేసి, రోడ్డును ఏర్పాటు చేశారు. వర్షం అధికంగా రావడంతో రోడ్డు కోసుకుపోయింది. దీంతో ఉడిత్యాల వీరన్నపల్లి నవాబుపేట తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మహబూబ్‌నగర్ గణేశ్‌నగర్‌లో..



మహబూబ్‌నగర్ వీరన్నపేట పండుగ సాయన్న ఆలయంలో..



గణేశ్‌భవన్‌లో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్ బాదేపల్లిలో..

పార్వతీ తనయ పాహిమాం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో శనివారం వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం కూడా వినాయకుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ఎమ్మెల్యే పూజలు చేశారు. పాతపాలమూరు, గణేష్‌భవన్, రాజేంద్రనగర్, రాంనగర్, అంబాభవాని దేవాలయం, రాంమందిర్ చౌరస్తా, హమాలీ సంఘం, మేదర సంఘం, మర్లు వినాయక వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పట్టణంలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి

జిల్లా కేంద్రంలోని గణేష్‌భవన్‌లో నిర్వహించిన వినాయక వేడుకల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వినాయక చవితి పురస్కరించుకుని శనివారం తెలంగాణ కాలనీలోని గణేష్‌భవన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

మట్టి గణపతిని పూజిద్దాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మట్టి గణపతిని పూజించి భావి తరాలను కాపాడుదామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

జడ్చర్ల టౌన్: వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా అఖిల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నికను ఖరారు చేశారు.

వెన్నాచేడ్‌లో గణపతి హోమం

గండేడ్: వినాయక చవితి సందర్భంగా మండల పరిధిలోని వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి, గండేడ్, రెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి, జానంపల్లి, పెద్దవార్వాల్, చిన్నవార్వాల్, రుసుంపల్లి తదితర గ్రామాల్లో వినాయక పూజలు నిర్వహించారు. ఆదివారం వెన్నాచేడ్ శివాలయంలో గణపతి హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన నిర్వహించారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బండమీదిపల్లిలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల అధ్యక్షుడు పి.యాదయ్యగుప్తా, కె.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ పూజలో ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ మార్కెట్ చైర్మన్ అమరేందర్‌రాజు, పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

డీఎస్పీ ప్రత్యేక పూజలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఏనుగొండ శివారులోని దేవునిగుట్టపై వినాయక మండపంలో ఆదివారం రాత్రి డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను గణేష్ ఉత్సవ యువసేన సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గణేశ మండపంలో సోమవారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు.



హన్వాడ ఆంజనేయస్వామి ఆలయంలో..



భూత్పూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



మూసాపేటలో పూజలు చేస్తున్న భక్తులు



దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో ..

సంతలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



భోజనం అందిస్తున్న నర్సింహచారి

నవాబుపేట: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం సంతకు వచ్చే ఇతర గ్రామాల ప్రజల కోసం ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ నేత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహచారి ప్రారంభించారు. తన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సంతకు వేల సంఖ్యలో జనాలు వస్తుంటారని, చాలా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేకపోవటంతో వారు గ్రామాలకు వెళ్లేందుకు చాలా ఆలస్యం అవుతుందని, అందుకు వారి సౌకర్యం కోసం ఈ ఉచిత భోజనం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. జేకే ట్రస్టు సుధాకర్, కాంగ్రెస్ నాయకులు రఘువీర్‌శర్మ, పుట్టి ఆంజనేయులు, నిరంజన్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. మొత్తం 200 మంది విద్యార్థులు హాజరుకాగా 16 మందిని ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ తెలిపారు. ఎంపికైన వారిలో ఇర్ఫాన్ అలీ, నవనీత్, కార్తికేయన్ రెడ్డి, రామాంజనేయులు, చరణ్, నిఖిలేశ్వర్, సిద్ధు, ప్రశాంత్, పవన్, విజయ్, రాంచరణ్, శివప్రసాద్, చరణ్‌తేజ్, మహేందర్, కార్తిక్, విఘ్నేష్‌లతోపాటు స్టాండ్‌బై చరణ్‌తేజ్, కౌశల్, రవీందర్ ఉన్నారు. ఈ నెల 14 నుంచి రెండు రోజుల పాటు హన్మకొండలో జరిగే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆలయ అభివృద్ధికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్/ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలోగల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన కె.బ్రహ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రభాకరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో బ్రహ్మయ్యను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. అనంతరం బ్రహ్మయ్యను పలువురు సన్మానం చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ నాయకులు పాల్కొండ బ్రహ్మయ్య, రాఘవచారి, సాయిబాబ, కృష్ణమూర్తి, మణికొండ నర్సింహాచారి, పాండాచారి, రామలింగంచారి, అంజయ్యాచారి, భాస్కరాచారి, బుచ్చయ్యాచారి, లక్ష్మీనారాయణచారి, నారాయణచారి, బ్రహ్మయ్యాచారి, నిరంజన్‌చారి, రమేష్‌చారి, సత్యచారి, సురేష్‌చారి పాల్గొన్నారు.



బ్రహ్మయ్యను సన్మానించిన సభ్యులు

విజయోత్సవ సభకు తరలిరండి

దేవరకద్ర: ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ.. టీఎంఆర్‌పీఎస్ విజయోత్సవ సభ ఈ నెల 21న నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలో నిర్వహించనున్నామని, సభకు టీఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని నారాయణపేట జిల్లా అధ్యక్షుడు బాలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ వద్ద విజయోత్సవ సభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సభకు రాష్ట్ర అధ్యక్షుడు సిరిసినోళ్ల బాల్‌రాజు తదితరులు హాజరవనున్నట్లు చెప్పారు.

విజయోత్సవ సభ పోస్టర్ విడుదల

కోయిల్‌కొండ: ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయం స్థానం ఇచ్చినటువంటి తీర్పుతో సామాజిక న్యాయం ఇప్పటికైనా అమలు కావాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు అన్నారు. ఈ నెల 21న నిర్వహించనున్న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గండేడ్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు మనం నడుచుకోవాలన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా.. గ్రామాల్లో కార్యకర్తలు గతంలో లాగానే ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. వారి సమస్యల సాధనకు నిరంతరం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పెంట్యానాయక్, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లికి బాలిక అప్పగింత

మహబూబ్‌నగర్ క్రైం: బస్టాండ్‌లో తల్లితో గొడవపడి వెళ్లిపోయిన చిన్నారిని ఆటో డ్రైవర్ గుర్తించి స్టేషన్‌లో అప్పగించాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన 11 ఏళ్ల బాలిక పట్టణంలో బీసీ హాస్టల్‌లో ఉంటూ చదువుతుంది. ఆదివారం కూతురిని ఇంటికి తీసుకెళ్లడానికి హాస్టల్‌కు తల్లి వెళ్లింది. ఇద్దరు కలిసి బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత సెలవులపై తల్లికి, బిడ్డకు మధ్య గొడవ జరగడంతో, ఆ బాలిక తల్లిని వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో బస్టాండ్‌లో తల్లి ఏడుస్తూ ఉండటంతో గమనించిన ఆటో డ్రైవర్ శ్రీనివాసులు తల్లిని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో దించి, మళ్లీ బస్టాండ్‌లో అతడు గాలించగా.. బాలిక దొరికింది. దీంతో బాలికను స్టేషన్‌కు తరలించి సీఐ ఇజాజుద్దీన్ సమక్షంలో తల్లికి అప్పగించారు. ఆ తర్వాత సీఐ ఆటో డ్రైవర్‌కు రూ.వెయ్యి అందించి, సన్మానించారు.

జీఎంఆర్‌కు పరామర్శ

చిన్నచింతకుంట: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి నాలుగు రోజుల కిందట మృతిచెందగా.. విషయం తెలుసుకున్న కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, మహబుబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, బీజేపి నాయకులు సుదర్శన్‌రెడ్డి, నంబిరాజు ఆదివారం చిన్నచింతకుంట మండలం దమగ్నాపురంలోని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నివాసానికి చేరుకొని కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

11 మందిపై కేసు నమోదు

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్‌కి చెందిన బొక్క ఆశన్న, బొక్క ఆంజనేయులుపై ఆదివారం దాయాదులు పాత కక్షలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని, దాయాదులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొక్క, ఆశన్న, ఆంజనేయులు ఇద్దరు అన్నదమ్ములు ఆదివారం పొలం వద్దకు వెళ్లారు. వెళ్లిన అరగంట లోపే బొక్క ఆశన్న కుమారుడు మధుకర్ తన తండ్రి ఫోన్ చేసినా.. ఎత్తకపోవడంతో అరగంట తర్వాత పొలం వద్దకు వెళ్లాడు. పొలం వద్ద తండ్రి ఆశన్న, పెద్దనాన్న ఆంజనేయులు తలకు, శరీరానికి తీవ్ర గాయాలతో ఉండగా.. ఎవరు కొట్టారని మధుకర్ తండ్రిని, పెద్దనాన్నను అడిగాడు. దాయాదులు దాడులు చేశారని, స్పింక్లర్ పైప్ రాడ్‌లు, కట్టెలతో కొట్టారని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆటోలో చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. దాయాదుల మధ్య పాత కక్షల కారణంగా బొక్క శంకర్, నరేష్, రాఘవేందర్, కృష్ణయ్య, పెద్దకృష్ణయ్య, రామకృష్ణ, వీరన్న, రాచాల ఆంజనేయులు, నర్సింహులు, రామకృష్ణ, రామాంజనేయులు దాడి చేసినట్లు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేత

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటకి చెందిన రామకృష్ణ ఇటీవల అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జానంపేట హైస్కూల్‌లో 2002- 03వ సంవత్సరం పదో తరగతి చదివిన రామకృష్ణ క్లాస్‌మెట్స్ రూ.50 వేలను పోగు చేసి ఆదివారం నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి రామకృష్ణకు నగదు అందజేశారు.

భూత్పూర్ ఊరచెరువుకు గండి, తప్పిన ప్రమాదం



భూత్పూర్ ఊరచెరువు గండి పూడుస్తున్న నాయకులు

భూత్పూర్: పట్టణంలోని ఊరచెరువుకు మూడు రోజుల కిందట గండి పడిన విషయం తెలుసుకున్న సమీప రైతులు గడ్డివేసి పూడ్చారు. శనివారం మధ్య రాత్రి వర్షం అధికంగా కురియడంతో పైనుంచి వరద భారీగా చెరువులోకి వచ్చింది. దీంతో ఆదివారం ఉదయం ఊరచెరువుకు గతంలో గండిపడిన చోట నుంచి నీరు రావడాన్ని గ్రహించిన రైతులు మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన చైర్మన్ జేసీబీలు, డోజర్లు, ట్రాక్టర్లు తెప్పించి గండిని పూడ్చివేశారు.

ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజాపూర్: బైక్‌ను అజాగ్రత్తగా నడిపి తన భర్త మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నవాబుపేట మండలం కారూర్‌కి చెందిన జంగయ్య శనివారం జడ్చర్లలో వినాయక చవితి పూలు, తదితర వాటిని విక్రయించి వస్తున్నాడు. కుచ్చర్‌కల్ సమీపంలో తన భర్త లిఫ్ట్ అడిగి వసున్న బైక్, మరో బైక్‌తో ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. తన భర్తను ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడని మృతుడి భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలియజేశారు.

మళ్లీ ముంచెత్తిన వరద

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సుమారు పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లా కేంద్రంలోని పెద్దచెరువుకు వరద కొనసాగుతూనే ఉంది. తాజాగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురియడంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఉద్ధృతి మళ్లీ పెరిగింది. ప్రస్తుతం ఈ చెరువులో 40 ఎంసీఎఫ్ (మిలియన్ క్యూబిక్ ఫీట్)ల నీరు ఉంది. అలాగే దీనికున్న రెండు అలుగుల ద్వారా 4–6 ఇంచ్‌ల మేర వరద నీరు కిందకు వదులుతున్నారు.

మున్సిపల్ చైర్మన్, కమిషనర్ పరిశీలన

శనివారం ఉదయం బీకేరెడ్డికాలనీలోని వివిధ వీధులతో పాటు రామయ్యబౌలి వైపు అలుగు వద్ద వరద పరిస్థితిని కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

లోతట్టు ప్రాంతాల్లో బృందం పరిశీలన

జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు తాజాగా ప్రత్యేక బృందాన్ని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఈ బృందం ఆదివారం రాత్రి రామయ్యబౌలిలోని అన్ని వీధులను పరిశీలించారు.



రామయ్యబౌలిలోని ఓ వీధిలో పొంగి పొర్లుతున్న వరదను గమనిస్తున్న ప్రత్యేక బృందం

ఎంబి షియోన్ చర్చిలో ఆదివారం వేడుకలు

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఎంబీసీయోన్ చర్చిలో ఆదివారం స్త్రీల సమాజ కమిటీ ఆధ్వర్యంలో స్త్రీల సమాజ ఆదివారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంబీ కాన్ఫరెన్స్ పీస్ కమిటీ చైర్మన్ రెవ క్రిస్టినా ఆశీర్వాదం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో, కుటుంబంలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. అనంతరం స్త్రీల సమాజ కమిటీ వారు శాలువాలతో సత్కరించారు. కమిటీ సభ్యులు రెవ జమిమా, జెరూష, సమాధానమ్మ, సంతోషమ్మ పాల్గొన్నారు.

బురద జల్లే రాజకీయాలు మానుకోవాలి



ఆస్పత్రికి వెళ్లేందుకు విడిచే స్థలాన్ని చూపిస్తున్న నాయకులు

జడ్చర్ల: జడ్చర్ల– గంగాపూర్ ప్రధాన రహదారిని అనుసరించి నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో తాము కొనుగోలు చేసిన భూమి వ్యవహారానికి సంబంధించి నిబంధనల మేరకే తాము భూమిని కొనుగోలు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే బంధువు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంమ్మోహన్, నాగిరెడ్డి తదితరులు తెలియజేశారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సదరు భూములకు సంబంధించిన భూ అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తామంటూ సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై వారు వివరణ ఇచ్చారు. రెవెన్యూ రికార్డుల ప్రకారంగా అంతా సవ్యంగా ఉన్న భూమిని మాత్రమే తాము కొనుగోలు చేశామన్నారు. ఈ భూమిలో నిర్మించిన ఆస్పత్రికి వెళ్లడానికి రోడ్డును నేరుగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని తెలియజేశారు. అయితే ఎన్నికలు రావడంతో ఆ ప్రతిపాదన నిలిచిపోయిందన్నారు. దీనిని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రాజకీయం చేసి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై బురదజల్లేలా వ్యవహరించడం తగదన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో వారు ఆస్పత్రికి వెళ్లేందుకు తాము విడిచే రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో కౌన్సిలర్లు దేవ, నందకిషోర్‌గౌడ్, సతీష్ పాల్గొన్నారు.